- ఫలించిన మొక్కులు

శుక్రవారం మేడిగడ్డ బరాజ్ వద్ద కాంగ్రెస్ సర్కారుకు బుద్ధి రావాలని మొక్కుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తదితరులు

- ఉప్పొంగిన కాళేశ్వరగంగ

శనివారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రవహిస్తున్న జలాలు

- ఎండిపోయిన మల్లన్నసాగర్

సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో డెడ్‌స్టోరేజీకి చేరిన మల్లన్నసాగర్

కేటీఆర్ వార్నింగ్.. మోటర్లు స్విచాన్

మొదటిపేజీ తరువాయి...

ద్వారా నీళ్లను ఎత్తిపోసిన ప్రభుత్వం.. మళ్లీ నాలుగు నెలల తర్వాత బహుబలి మోటర్లు ఆన్ చేసింది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

సర్కారుకు కేటీఆర్ వార్నింగ్

సముద్రం పాలవుతున్న గోదావరి జలాలను కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఎత్తిపోసి.. ఎగువన ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25, 26 తేదీల్లో కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బృందం ప్రాజెక్టులను సందర్శించింది. 25న లోయర్‌మానేరు డ్యాం ప్రాజెక్టును, 26న మేడిగడ్డ ప్రాజెక్టుతోపాటు లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌ను సందర్శించింది. ఆ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ పంపుహౌస్ నుంచి నీటిని పంపింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే ఆగస్టు 2లోగా ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని, అప్పటికీ నీటిని పంపింగ్ చేయకపోతే 50 వేల మంది రైతులతో వచ్చి తామే ప్రారంభిస్తామని హెచ్చరించారు.

దిగొచ్చిన సర్కారు

కేటీఆర్ అల్టిమేటం ఇచ్చిన 24 గంటల్లోనే కాంగ్రెస్ సర్కారు ఎత్తిపోతలను ప్రారంభించింది. నిజానికి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ ఎత్తిపోతలను నాలుగైదు రోజుల ముందు నుంచే ఎత్తిపోసేందుకు అవకాశం ఉన్నది. అధికారులు కూడా అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు మాత్రం పైపులు ఆన్ చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న ఉద్దేశంతో నాన్చివేత ధోరణి అవలంబించింది. ఈ తరుణంలో కేటీఆర్ డెడ్ లైన్ విధించారు. దీంతో ఎత్తిపోతలు ప్రారంభించకుంటే వేల మంది రైతులు తరలివచ్చి కేటీఆర్‌కు అండగా నిలుస్తారని, తమ కు చెడ్డ పేరొస్తుందని భావించి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. అందులో భాగంగానే.. శనివారం నుంచి ఎత్తిపోతల కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రస్తుతం కాళేశ్వరం లింక్-2 కింద మోటర్లు ఆన్ చేసి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మధ్యమానేరుకు ఎత్తిపోతలను ప్రారంభించింది. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం లోని నంది పంపుహౌస్‌లో 4 మోట ర్లు అన్ చేశారు. ఒక్కో మోటరు ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 12,600 క్యూసెక్కులను ఎత్తిపోస్తూ కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయ త్రి పంపుహౌస్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ నాలుగు బహుబలి మోటర్లు ఆన్ చేసి, వచ్చిన నీటిని వచ్చినట్టు ఎత్తి వరదకాలువ ద్వారా మధ్యమానేరు ప్రాజెక్టుకు పంపిస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న మోటర్ల ప్రకారం చూస్తే.. రోజుకు 1.2 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తున్నారు. నందిమేడారం, గాయత్రి పంపుహౌస్ వద్ద 7 మోటర్లు ఉండగా, మొత్తం పంపులను ఆన్‌చేస్తే రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చు.

కన్నెపల్లే కరెక్ట్

ఈ సీజన్‌లో మేడిగడ్డ నుంచి దాదాపు 540 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి. మేడిగడ్డ వద్ద ఉన్న లక్ష్మి (కన్నెపల్లి) పంపుహౌస్ నుంచి ముందుగానే ఎత్తిపోతలు ప్రారంభించి ఉంటే ఈ పాటికి ఎగువన ఉన్న అన్ని ప్రాజెక్టులను నింపుకునే ఆస్కారం ఉండేది. అంతేకాదు, శనివారం సాయంత్రం చూస్తే మేడిగడ్డ వద్ద 5,39,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. అంటే దాదాపు రోజుకు 50 టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారులు చెప్పారని, అందుకే తాము లక్ష్మీ పంపుహౌస్ నుంచినీటిని ఎత్తిపోసేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వాదిస్తున్నది. దీని ద్వారా వందల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయి తప్ప.. తెలంగాణ రైతులకు ఉపయోగం లేకుండా పోతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.3969 టీంఎసీల నీరు ఉన్నది. ఇన్ ఫ్లో 12,931 క్యూసెక్కులు మాత్రమే ఉన్నది. నిజానికి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలు, కరెంటు అవసరాల నిమిత్తం దాదాపు పది టీఎంసీలను ఉంచాల్సి ఉంటుంది. ఇన్‌ఫ్లో తగ్గితే ఈ ప్రాజెక్టు నుంచి నాలుగైదు టీఎంసీ లకన్నా ఎక్కువ ఎత్తిపోయడానికి వీలుండదు. అదే జరిగితే మళ్లీ ఎగువన ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి ఎండమావే అవుతుంది. మధ్యమానేరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 27.54 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అందులో 6.87 టీంఎసీలు మాత్రమే ఉన్నాయి. లోయర్‌మానేరు డ్యాం, అన్నపూర్ణ జలాశయం, ఎగువమానేరు, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టులు నింపుకోవాలంటే.. దాదాపు 150 టీఎంసీల నీళ్లు అవసరమవుతాయి. దీనికి ఎస్సారెస్పీ ప్రాజెక్టుని కలుపుకుంటే దాదాపు 200కు పైగా టీఎంసీల వరకు నీళ్లు అవసరం పడుతాయి. వీటిని నింపుకోవాలంటే కన్నెపల్లి పంపుహౌస్ ఆన్ చేయడం తప్ప మరోమార్గం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పపుహౌస్ వద్ద కాళేశ్వరం జలాలకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నాడు కేసీఆర్ గర్జన

పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూడా కాంగ్రెస్ సర్కారు నీటి విడుదలపై ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నీటిని విడుదల చేయాలని వరదకాలువ నీటి పరీవాహక ప్రాంత రైతులు మార్చి, ఏప్రిల్‌లో ఆందోళనలు చేశారు. అప్పుడు వారికి కేసీఆర్ అండగా నిలిచారు. పంటలు ఎండిపోతున్నా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని తరలించలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయలేదు. దీంతో గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా వరద కాలువ అడుగంటింది. కాలువలో క్రేన్లు బిగించి రైతులు కాలువలో గుంతలు తవ్వుకుని నీటిని పంటలకు తరలించే ప్రయత్నాలు చేశారు. తమ పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ అనేక సార్లు ఆందోళనకు దిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గంగాధర, రామడుగు, బోయినపల్లి, మల్యాల మండలాల రైతులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కరీంనగర్, జగిత్యాల రహదారిపై పలుసార్లు రాస్తారోకోలు చేశారు. ప్రభుత్వం మాట వినకపోవటంతో కేసీఆర్ గర్జించారు. వెంటనే రైతులను ఆదుకోవాలని సర్కారును హెచ్చరించారు. దెబ్బకు దిగొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మార్చి చివరలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించింది. రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు నీటిని ఎత్తిపోశారు. అక్కడి నుంచి 6వ బాహుబలి మోటర్ ద్వారా వరద కాలువలోకి ఎత్తి పోశారు. వరద కాలువ ఎగువ ప్రాంతంలోని 122వ కిలోమీటర్ వద్ద గేట్లు మూసివేయటంతో.. అటు ఎస్సారెస్పీకి వెళ్లకుండా దిగువ ప్రాంతానికి నీటిని మళ్లించారు. తద్వారా రైతులకు కొంత మేలు చేకూరింది.

మొగులు దిక్కు జూసుడే..

రిజర్వాయర్లలో నీళ్లు లేవు.. మరోవైపు వానలు రావు.. సగానికిపైగా పడని వరి నాట్లు

- కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం ఫలితం
- డెడ్‌స్టోరేజీకి చేరిన రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్
- నిరుడు ఇదే సమయంలో నిండుకుండలా..
- ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేసిన సర్కార్

సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో మల్లన్నసాగర్ కాల్వల దుస్థితి

సిద్దిపేట, జూలై 27 (నమస్తే తెలంగాణప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లు నేడు బోసిపోయి కనిపిస్తున్నాయి. రిజర్వాయర్లను నింపి చెరువులకు నీటిని విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరిగి గత ఏడాది తరహాలో తాము సాగు చేసుకోవచ్చని భావిస్తూ రైతులు ఆశగా సాగు నీటికోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు వానల కోసం మొగులు వైపు చూస్తున్నారు. ఫలితంగా ఇప్పటివరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగు లక్ష్యంలో సగానికిపైగా విస్తీర్ణంలో నాట్లు పడలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండుటెండల్లో కాళేశ్వర జలాలను చెరువులకు విడుదల చేయడంతో చెరువులు నిండుకుండలా కనిపించాయి. వర్షాకాలం ప్రారంభం కాగానే కొద్దిపాటి వర్షానికి చెరువులు నిండిపోయేవి. దీంతో పుష్కలంగా సాగు నీరు అందింది. గత వేసవిలో కాళేశ్వర జలాలను విడుదల చేయకపోవడంతో చెరువులు ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వర జాలలు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది.

బీడు పొలాలనూ పారించిన బీఆర్ఎస్ సర్కార్

సిద్దిపేట జిల్లాలో కాళేశ్వర ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. సిద్దిపేట జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ఉన్నాయి. నాలుగేండ్లుగా ఎప్పుడు కాళేశ్వరం నీటితో కళకళలాడిన ఈ రిజర్వాయర్లు నేడు నీళ్లు లేక బోసిపోయాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎక్కడో పుట్టిన గోదావరి నీళ్లు ఇక్కడికి తీసుకువచ్చి బీడుబారిన పొలాలను పారించారు. రికార్డు స్థాయిలో రిజర్వాయర్లను, ప్రధాన కాల్వలను పూర్తి చేయించి ప్రతి చెరువు, వాగును, చెక్‌డ్యాంను మండుటెండల్లోనూ నింపారు. పుష్కలంగా పంటలు పండాయి. అలాంటి జిల్లాలో ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కానీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా 50 శాతం వరి నాట్లు పడలేదు. సాగు నీటి కష్టాలతోనే రైతులు వరి నాట్లు వేయడం లేదు. వారం రోజుల నుంచి జిల్లాలో సాధారణ వర్షం తప్పా.. పెద్ద వానలు కురిసిన సందర్భం లేదు. ఇప్పుడిప్పుడు రైతులు వరి నాట్లు వేస్తున్నారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రభుత్వం అసలు రైతుల గురించి పట్టించుకోవడం లేదు. కనీసం కట్టిన ప్రాజెక్టులకు నింపి రైతులకు సాగు నీరు అందిద్దామనే ఆలోచన సైతం అధికార పార్టీకి రావడం లేదని రైతులు మండిపడుతున్నారు.

అడుగంటిన రిజర్వాయర్లు

ఏటా కాళేశ్వర జలాలతో కళకళలాడిన రిజర్వాయర్లు నేడు నీళ్లలేక బోసిపోయి కనిపిస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్లను నింపి పెట్టింది. అవసరాన్ని బట్టి చెరువులకు నీటిని విడుదల చేసుకునే విధంగా సిద్ధం చేసి ఉంచింది. కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టునే నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తున్నది. జిల్లాలోని ప్రధాన కాల్వలతోపాటు, మైనర్ కాల్వల్లో మట్టి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. కనీసం కాల్వలను శుభ్రం చేద్దామనే ఆలోచన కూడా ప్రభుత్వానికి రావడం లేదు.

అప్పుడే బాగుండే..

కేసీఆర్ సర్కారే బాగుండె. గి కాంగ్రెస్ వచ్చాక బాగా ఇబ్బంది అయితాంది. గత ప్రభుత్వం మల్లన్నసాగర్ ద్వారా చెరువులను నింపింది. పంట పొలాలతోపాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుండె. ఈ సారి మల్లన్నసాగర్ నింపక పోవడం.. టైమ్‌కు వర్షాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నం. మల్లన్నసాగర్ ఉందని చాలా సంతోషం ఉండే. కాంగ్రెస్ వచ్చినంక ఆ సంతోషమే లేకుండా పోయింది.

- జీడిపల్లి స్వామి, లింగాపూర్, మం: తొగుట, జిల్లా సిద్దిపేట

తప్పని సాగునీటి కష్టాలు

మాకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. గత ప్రభుత్వం మా దగ్గర్లోని కొండపోచమ్మ సాగర్‌ను ఎప్పుడు నిండుకుండలా ఉంచేది. దాంతో రైతాంగానికి సాగునీరు అందించేది. గత ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించడంతో ఎక్కువగా వరిసాగు చేసేవాళ్లు. నేడు అటు వర్షాలు లేక ఇటు ప్రభుత్వం సాగు నీళ్లు అందించకపోవడంతో చాలామంది వరినాట్లు వేయలేకపోయారు. కొండపోచమ్మ సాగర్‌ను నింపకపోవడంతో సాగు నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా ఉన్నట్లే ప్రస్తుత ప్రభుత్వం కూడా సకాలంలో సాగునీళ్లు అందించి భరోసా కల్పించాలి.

-గడ్డం ప్రవీణ్‌కుమార్, గంగాపూర్, మం: గజ్వేల్, జిల్లా సిద్దిపేట

సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లు

రిజర్వాయర్ పేరు	సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీలు)
అన్నపూర్ణ	3.5	0.73
రంగనాయక సాగర్	3.00	0. 69
మల్లన్నసాగర్	50.00	8.849
కొండ పోచమ్మ	15.00	4.75
శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు	1.092	0.463

ఉమ్మడి మెదక్‌లోని సాగు లక్ష్యం విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	మొత్తం సాగు లక్ష్యం ఎకరాలు	వరి సాగు లక్ష్యం ఎకరాలు
సిద్దిపేట	3,77,000	3,48,000
మెదక్	3,73,509	3,27,113
సంగారెడ్డి	2,24,245	1,50,000

నోట్: ఇప్పటివరకు ఎక్కడా 50 శాతం వరి నాట్లు పడలేదు.

తుంగభద్ర ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న జలాలు

పోటెత్తుతున్న కృష్ణమ్మ

- శ్రీశైలానికి 4.14 లక్షల క్యూసెక్కులు
- జూరాలకు 3 లక్షల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): కర్ణాటక, మహారాష్ట్రతోపాటు, తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పొంగి పొర్లుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి దిగువకు భారీగా ప్రవాహం కొనసాగుతున్నది. జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పెరిగిపోయింది. శనివారం జూరాలకు 3 లక్షల క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 4.14 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టులో 24 గంటల్లోనే 20 టీఎంసీలకుపైగా జలాలు వచ్చి చేరగా, ప్రస్తుతం 127 టీఎంసీలకు చేరుకున్నది. ఎస్సారెస్పీకి వరద క్రమంగా పెరుగుతున్నా, దిగువన ప్రాణహిత నుంచి ప్రవాహాలు తగ్గుముఖం పట్టాయి. లక్ష్మీబరాజ్ వద్ద వరద ప్రస్తుతం 8,35,795 క్యూసెక్కులు ఉండగా, ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టుకు వరద ప్రవాహం కూడా స్వల్పంగానే కొనసాగుతున్నది.

పోతిరెడ్డిపాడు నుంచి నీటిమళ్లింపు షురూ..

శ్రీశైలం ప్రాజెక్టుకు 100 టీఎంసీల జలాలు చేరాయి. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 127 టీఎంసీలకు చేరుకున్నది. శుక్రవారం ప్రాజెక్టు 866 అడుగులకు చేరుకున్నది. ఏపీ సర్కారు పోతిరెడ్డిపాడు ద్వారా 5వేల క్యూసెక్కులను మళ్లిస్తున్నారు. ఏపీ అధికారులు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 12 టీఎంసీలు కావాలంటూ కేఆర్ఎంబీకి ఏపీ సర్కారు ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది.

మరో రెండు రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్: వాతావరణ శాఖ

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోవారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. జగిత్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక హైదరాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. గత 24 గంటల్లో అత్యధికంగా ములుగు జిల్లా తడ్వాయిలో 5.54 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు తెలిపింది.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	31.3°c	22.7°c
ఖమ్మం	31.0°c	25.0°c
నల్లగొండ	30.5°c	23.4°c
మెదక్	30.0°c	21.4°c
ఆదిలాబాద్	29.0°c	24.0°c
నిజామాబాద్	28.2°c	24.1°c
మహబూబ్‌నగర్	27.0°c	23.2°c
కరీంనగర్	27.0°c	24.0°c
హైదరాబాద్	27.2°c	24.2°c
వరంగల్	26.0°c	24.0°c

భద్రాచలం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి, (ఇన్‌సెట్‌లో)భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్న గోదావరి

దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి గ్రామానికి రాకపోకలు లేకుండా రోడ్డుపైకి చేరిన వరద

భద్రాద్రిలో గోదారమ్మ ఉగ్రరూపం

రాత్రి 11 గంటలకు 53.60 అడుగులతో ప్రవాహం.. మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27 (నమస్తే తెలంగాణ): వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం పట్టణం లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద చేరింది. గోదావరి తీర ప్రాంతమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. శనివారం రాత్రి 11 గంటలకు 53.60 అడుగుల వద్ద వరద ప్రవహించడంతో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం క్రమేపీ పెరగడంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భద్రాచలానికి పక్కనే ఉన్న ఆంధ్రా ప్రాంతానికి కూడా తెలంగాణతో రాకపోకలు తెగిపోయాయి. అటు శబరి.. ఇటు గోదావరి నదులు పొంగి ప్రవహించడంతో చింతూరు-చట్టి రహదారిపైకి నీరు చేరి నెల్లిపాక నుంచి చింతూరు వెళ్లే రహదారికి రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం రోడ్డులో వరద రహదారి పైకి చేరడంతో వీఆర్‌పురం వెళ్లే రహదారికి రాకపోకలు లేవు. దీంతో అటువైపు వెళ్లే వాహనాలను సారపాక క్రాస్‌రోడ్ వద్దనే నిలిపివేశారు. ఎడతెరిపిలేని వర్షాలకు ఒకవైపు తాలిపేరు.. మరోవైపు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చర్ల మండలంలోని వాగులు, చెరువులు పొంగుతున్నాయి. తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లను ఎత్తి 1,13,752 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

శనివారం కురిసిన భారీ వర్షానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం పోతుల్‌వాయి వద్ద రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రవాగు